ప్రజాశక్తి
శుక్రవారం 31 మే 2024
5
అనంతపురం





జెఎన్‌టియులో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్






- తల్లిదండ్రులకు ఫీజుల భయం
- నోట్ల కట్టలతో పాఠశాలలకు..!
- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- రైతులకు పెట్టుబడుల బెంగ
- ఈ నెలంతా ఏదో రూపంలో ఖర్చులే

ఖర్చుల మాసం..!

జూన్ మాసం వచ్చిదంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు బెంగ పట్టుకుటుంది. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులున్న ఇళ్లలో జూన్ ఫీవర్ మరింత ఎక్కువగానే ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఇలా అన్ని ఖర్చులూ ఒకే సారి వస్తాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రాంభం కావడంతో అన్ని కుటుంబాలపై ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్





ఫీజుల భారం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.30వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.70వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి లాంటి పథకాల అమలు చేస్తున్నా ఇవి పెరిగిన పుస్తకాలు, ఫీజుల ధరలకు ఏ మూలకూ సరిపోవడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1200 ప్రయివేటు పాఠశాలలు, 500 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పాఠశాలల్లో సుమారు 1.50 లక్షల మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించి ఫీజుల వసూళ్లపై నిఘా ఉంచితే సామాన్యులకు విద్య భారం కాకుండా ఉటుంది.

నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!



ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్‌కు దారబోస్తున్నారు.



రైతులకు పెట్టుబడుల భారం

జూన్ నెల రైతులపై కూడా భారాన్ని తెస్తుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రాంభం అయి పొలం పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం అయ్యింది. గత పది రోజుల కాలంలో వర్షాలు కూడా రావడంతో రైతులు పొలంలో వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. సబ్సిడీ వేరుశన విత్తనకాయల కొనుగోలుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే ఇది ఉమ్మడి జిల్లాలో 20 శాతం మంది రైతులకు కూడా అందలేదు. ఖాతాల్లో వేసిన వారికి కూడా అరకొరగానే నగదు జమ అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

ఏ ఫలితం ముందు..?

- ఓట్ల లెక్కింపునకు పూర్తవుతున్న ఏర్పాట్లు
- పార్లమెంటుకు 14, అసెంబ్లీకి 19 టేబుళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. వచ్చే మంగళవారం జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేపట్టింది. అనంతపురం పార్లమెంటు పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు అనంతపురం జెఎన్‌టియులో జరగనున్నాయి. దీనికి సంబంధించి అవసరమైన ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు కావడంతో పార్లమెంట్, అసెంబ్లీ రెండింటికీ ఒకేసారి ఎన్నికలు జరిగాయి. దీంతో ఈ రెండు ఓట్ల లెక్కింపు ఒకేసారి జరగనుంది. అనంతపురం పార్లమెంటుకు వచ్చే సరికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఒక రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. మొత్తం పూర్తవ్వాలంటే 21 రౌండ్ల వరకు జరగనున్నాయి. అదే అసెంబ్లీ నియోజకవర్గాల వరకు చూస్తే ఒక రౌండ్‌కు 19 టేబుళ్ల ఉండనున్నాయి. దీని ప్రకారం సగటున 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. నాలుగు గంటల వ్యవధిలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఉదయం 7.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేసియున్నారు. అంటే మధ్యాహ్నం ఒంటి గంటలోపు పూర్తయ్యే విధంగా ఏర్పాట్లు చేపట్టియున్నారు.

అసెంబ్లీ ఫలితాలే ముందు రానున్నాయి..

అనంతపురం పార్లమెంట్ పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ఏ నియోజకవర్గ ఫలితం ముందురానుందోనన్నది ఆసక్తికరంగామారింది. పోలింగ్ స్టేషన్ల వారీగా చూస్తే తక్కువ ఉన్నది కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం. ఇక్కడ 261 పోలింగు స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగు స్టేషన్‌కు ఒక ఇవిఎం చొప్పున ఒక రౌండ్‌కు ఒక ఇవిఎం రానుంది. 19 టేబుళ్ల ప్రకారం 14 రౌండ్లలోపే ఫలితం రానుంది. ఉరవకొండలో 263 పోలింగు కేంద్రాలున్నాయి. ఇది కూడా 14 రౌండ్లలోపే ఫలితం వస్తుంది. తాడిపత్రి 274 పోలింగు కేంద్రాలు 14 రౌండ్ల కంటే ఎక్కువ ఫలితమొస్తుంది. గుంతకల్లు 276 పోలింగు కేంద్రాలు ఇది కూడా 15 రౌండ్లలో పూర్తవనుంది. రాప్తాడు 281 పోలింగు కేంద్రాలు 15 రౌండ్లు రానున్నాయి. అనంతపురం 292 పోలింగు కేంద్రాలు, శింగనమల 293 పోలింగు కేంద్రాలు, రాయదుర్గం గరిష్టంగా 296 పోలింగు కేంద్రాలు ఉన్నాయి. ఇది 16 రౌండ్ల వరకు లెక్కింపు జరగనుంది. ఇలా చూసినప్పుడు అన్నింటి కంటే ముందు కళ్యాణదుర్గం తక్కువ పోలింగు కేంద్రాలు ఉండటంతో ముందుగా ఇది పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా ఫలితాలపై సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠత నెలకొంది. అధికారులు మాత్రం ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి గందరగోళం లేకుండా సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగు కేంద్రాల వద్దకు అనుమతి ఉన్న వారు తప్ప తక్కిన వారిని రానివ్వడంలేదు. అంతేకాకుండా జిల్లా అంతటా 144 సెక్షన్‌ను ఇప్పటి నుంచే అమలు చేస్తున్నారు.

కౌంటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల కౌంటింగ్ దష్ట్యా 24 గంటల పాటు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌పై ఎస్పీ, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ అమలుపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్, ఎగ్జిట్ పోల్ ఫలితాల ప్రకటన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. గొడవలు, ఇబ్బందులు పెట్టే వారికి షాడో పార్టీల ఏర్పాటు చేయడం, వారి నడవడికలను ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసుకొని ముందుగానే గుర్తించాలన్నారు. లా అండ్ ఆర్డర్ అమలులో భాగంగా బైండోవర్స్, రౌడీషీటర్లపై దష్టి పెట్టాలన్నారు. 133, 144 సెక్షన్ అమలు పకడ్బందీగా చేయాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో శాంతిభద్రతల కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బైండోవర్లపై రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బైండోవర్లు చేసిన వారు మళ్లీ వచ్చి హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ కౌంటింగ్ దష్ట్యా అత్యంత పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. లా అండ్ ఆర్డర్ అమలులో భాగంగా పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అవసరమైన పెట్రోలింగ్ వాహనాలను సమకూర్చాలన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేస్తున్న 225 సిసిటీవీ కెమెరాలను ఒకటో తేదీలోపు ఏర్పాటు చేయడం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, కరుణకుమారి, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్‌ఓ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి శయణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం చక్రస్నానం తదుపరి వసంతోత్సవం, రాత్రి ధ్వజాఅవరోహణం, శ్రీవారి శయణోత్సవం తదితర వేడుకలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం సాయంత్రం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభంలో ధ్వజారోహణం చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేసిన అర్చకులు.. ధ్వజాఅవరోహణం (గరుత్మంతుడి పటం) కిందకు దించడం ద్వారా ఉత్సవాలు ముగింపు పలికారు. అనంతరం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వారికి శయణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు 13 రోజులు వివిధ ఉత్సవాల్లో పాల్గొని అలసిన శ్రీవారు, ఉభయ దేవేరులకు విశ్రాంతిని ఇచ్చే కార్యక్రమంలో భాగంగానే శయణోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఈఓ విజయ్ కుమార్, అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీ స్వామి, సత్యనారాయణ స్వామి, గుండురావు స్వామి, ఆలయ సిబ్బంది మారుతి ప్రసాద్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి చక్రస్నానం.. వసంతోత్సవం..!

పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతకుముందు తెల్లవారుజాము నుంచే స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.అనంతరం పల్లకిలో ఉభయదేవేరులతో కూడిన శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా శ్రీ ఉద్భవ లక్ష్మీ అమ్మవారి ముఖ మండపానికి తీసుకెళ్లారు. అక్కడ ఈవో విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్ స్వామి, బాలాజీ స్వామి, గుండురావు స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి, శ్రీ సుదర్శన చక్రానికి పసుపు, కుంకుమ కలిపిన పవిత్ర జలంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులపై ఆ జలాలు జల్లి వసంతోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో స్వామివారి చక్రస్నానం చూసిన వారికి, వసంతోత్సవంలో పాల్గొన్న వారికి, ఇందుకు సహకరించినవారికి ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బందితోపాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హరినాథ్ హెచ్చరించారు. గురువారం నాడు శెట్టూరు మండల పరిధిలోని చిన్నంపల్లి, యాటకల్లు, మంగంపల్లి తదితర సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. పాత నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాల్లో ఏ రాజకీయ పార్టీలు గెలుపొందినా ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రజలు రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు శాంతియుతంగా ఉండాలని తెలియజేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ హరినాథ్

ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పరశురాం, రాంభూపాల్, ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో ఉలికిపాటు..!

- యువ న్యాయవాది దారుణ హత్య
- మృతుడు ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి
- హత్యకు భూ వివాదమే కారణమా..?

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, హిందూపురం టౌన్



మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మృతుడు సంపత్‌రాజ్ (ఫైల్‌ఫొటో)

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం గురువారం నాడు ఉలికిపాటుకు గురైంది. యువ న్యాయవాది, ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ దారుహత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఒక్కసారిగా ధర్మవరాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ఇందుకు సంబంధించి... పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... సంపత్‌రాజ్ ఎన్ఎస్‌యుఐ కేరళ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉన్నాడు. ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికల వ్యవహారాలను చూసుకున్నాడు. అక్కడ పనులు ముగించుకుని నాలుగు రోజుల క్రితం హిందూపురానికి వచ్చాడు. బుధవారం రాత్రి హిందూపురం పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న పాన్ షాప్‌లో రెండు పాన్‌బీడాలు కట్టించుకుని వెళ్లాడు. అనంతరం తన అక్క భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి తన స్నేహితులు వచ్చారని, మళ్లీ ఫోన్ చేస్తాను అంటూ ఫోన్ పెట్టేశాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కారులో సంపత్‌రాజ్‌ను పిలుచుకుని వెళ్లారు. దారి మధ్యలో అతన్ని హత్య చేసి గురువారం తెల్లవారుజామున ధర్మవరం పట్టణంలోని చెరువు రెండో మరువ వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లారు. ఉదయం అటుగా వెళ్లిన ప్రజలు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని ప్యాంటు జేబులో ఉన్న పాన్‌బీడా కవర్‌పై ఉన్న అడ్రస్ ఆధారంగా విచారణ చేసి మృతుడు సంపత్‌రాజ్‌గా గుర్తించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలంలో నిశితంగా పరిశీలించారు. విషయం తెలుసుకున్న సంపత్‌రాజ్ తండ్రి రాజశేఖర్, అక్క భాగ్యలక్ష్మిలు ధర్మవరం వచ్చి సంపత్‌రాజ్ మతదేహాన్ని చూసి కన్నీటి పర్యవంతం అయ్యారు. మతుడు సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ తన కుమారుడు హత్యకు హిందూపురం సీనియర్ న్యాయవాది కష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జున, మరికొంతమంది కారణం అంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. సంపత్‌రాజ్‌ను ఎక్కడ హత్య చేశారు..? ఎవరు హత్య చేశారు..? ఎందుకు హత్య చేశారు..? హత్యలో ఎవరెవరు ఉన్నారన్న విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. కాగా సంపత్‌రాజ్‌ను హత్య చేసి మృతదేహాన్ని తీసుకొచ్చిన కారును అనంతపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సంపత్‌రాజ్ హత్య విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్, అనంతపురం డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ధర్మవరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆశ్వర్థనారాయణ, ఎన్ఎస్‌యుఐ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య చేసిన నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

భూ వివాదమే కారణమా..?

మృతుని తండ్రి, కుటుంబ సభ్యులు చెబుతున్న మేరకు భూ వివాదమే హత్యకు కారణం అయ్యి ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురంలోని మరో సీనియర్ న్యాయవాదితో ఓ స్థలం వివాదంలో ఇద్దరికి గొడవలు ఉన్నట్లు తెలుస్తోంది. సంపత్‌కుమార్ స్నేహితుడు శ్రీకాంత్‌రెడ్డి చెందిన స్థలం విషయంలో మిత్రుని పక్షనా పోరాటం చేస్తున్నారు. ఈ విషయంలో సంపత్‌రాజ్, మరో న్యాయవాది మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగాయి. పోలీసు కేసులు కూడా నడిచాయి. తనకు ప్రాణహాని ఉందని మతుడు సంపత్‌రాజ్ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కోణంలోనే అతని హత్య జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

విద్యార్థి, దళిత సంఘాలు, న్యాయవాదుల ఖండన

ఎన్ఎస్‌యుఐ నాయకుడు, యువ న్యాయవాది సంపత్‌రాజ్ హత్యను పలు విద్యార్థి, దళిత సంఘాలు, న్యాయవాదులు ఖండించారు. సంపత్‌రాజ్ హత్య నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూపురంలో విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎస్ఎఫ్ నాగభూషణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంపత్ రాజ్ హత్యను ఖండిస్తూ దళిత, ప్రజా సంఘాల నాయకులు గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, బిఎస్‌పి శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి కుమార్, మాదిగ దండోర జిల్లా నాయకులు మద్దిలేటి, దళిత సమాఖ్యా జిల్లా అధ్యక్షులు సుబ్బరాయప్పలు మాట్లాడారు. దళిత కుటుంబంలో పుట్టి అత్యున్నత స్థాయికి ఎదిగిన సంపత్‌రాజ్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే దుండగులు హత్య చేశారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పది సప్లిమెంటరీ పరీక్షకు 49.79 శాతం గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన బయలాజికల్ సైన్స్‌కు 49.79 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కు 89,946 మంది హాజరు కావాల్సి ఉండగా 4,454 గైర్హాజరయ్యారని పరీక్షల విభాగం ఎసి గోవిందనాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తనిఖీ చేశారు.

52,767 క్వింటాళ్ల వేరుశనగ విత్తన పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో గురువారం నాటికి 52,767 మంది రైతులకు 52,767 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. సబ్సిడీ వేరుశనగ కాయలు కోసం ఆర్‌బికెలో 68,155 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అందుకు అనుగుణంగా వేరుశనగ కాయలను ఆర్‌బికెలకు పంపుతున్నట్లు తెలిపారు.

జిల్లాకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు కేటాయించిన పిపిఎల్ కంపెనీకి చెందిన ఎరువులు గురువారం ప్రసన్నాయపల్లి రైల్వే రేఖ్ పాయింట్‌కు చేరినట్లు తెలిపారు.జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 220 మెట్రిక్ టన్నుల యూరియా, 19:19:19 ఎరువులు 245 మెట్రిక్ టన్నులు, 14:35:14 ఎరువులు 269 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలు మేరకు గోదాముల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు.

గొర్రెల వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-బెళుగుప్ప

గొర్రెలకు సోకే వ్యాధులపై కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఎ.రమేష్ తెలిపారు. ముఖ్యంగా గొర్రెల కాపరులు పొట్ట జలగ వ్యాధులను గుర్తించి వాటి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన బోయ కంచి రాముడుకు చెందిన గొర్రెలు మేతకు తీసుకెళ్లగా పొలంలోనే అకస్మాత్తుగా 20 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి అక్కడికెళ్లి వాటికి చికిత్సలు అందించారు. వ్యాధి తీవ్రం అయ్యి ఒక గొర్రె మరణించింది. కాపరులు ఇలాంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి గొర్రెలకు టీకాలు వేయించాలని సూచించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని ఎంఆర్‌సి కార్యాలయంలో మండల వ్యాప్తంగా మధ్యాహ్నం భోజనం కార్మికులకు ఎంపీడీవో కవిత ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. వీటితో పాటు వంటల పోటీలూ నిర్వహించారు. పిల్లలకు అందించే మధ్యాహ్నం భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వంటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి కమలాబాయి, ఎంఇఒ ఓబులపతి, ఎంఆర్‌సి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక, మానసిక పిల్లల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి- బ్రహ్మసముద్రం

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శారీరక, మానసిక, దివ్యాంగ సమస్యలున్న పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఇఆర్‌పిలు అరుణ, సుశీల తెలిపారు. ఇలాంటి సమస్యలున్న 0 నుంచి 18 సంవత్సరాల వయస్సును పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇలాంటి వారి కోసం మండల కేంద్రంలో ప్రభుత్వం భవిత పాఠశాల ఏర్పాటు చేసిందన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో జనసేవ సొసైటీ వ్యవస్థాపకులు నరిశెట్టి ఆదిశేషు ఆధ్వర్యంలో శాంతిరాం హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని గురువారం నిర్వహించారు.కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి శిబిరంలో చికిత్సలు చేశారు. పరీక్షల అనంతరం 35 మందిని శస్త్రచికిత్స కోసం నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌కు పంపారు. ఈ కార్యక్రమం అనంతరం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు ధనుంజయ, బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తంపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపథ్యంలో రైతులు పంటల సాగులో చేపట్టాల్సిన ఆధునిక నూతన వ్యవసాయ పద్ధతులపై సాగుకు సమాయత్తం కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నట్లు జిల్లా వనరుల కేంద్రం డిడిఎ మద్దిలేటి తెలియజేశారు. గురువారం మండల పరిధిలోని 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజ కుమారి పాల్గొన్నారు. ఇప్పటిదాకా సాగు చేసిన పంటలలో చీడపీడల బెడదల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మొదల కుళ్ళు, కాండం కుళ్ళు, మవ్వకుల్లు వేరుశనగ సాగులో ఎదురయ్యే ఇతర చీడపీడల సమస్యలు వాటి నివారణ గురించి క్షుణ్ణంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మికశక్తిని ప్రభుత్వాలకు చాటిచెబుదాం

సమస్యల పరిష్కారమే సిఐటియు ధ్యేయం - జిల్లాలో ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్య పోరాటం సాగిస్తూ కార్మిక శక్తిని ప్రభుత్వాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలియజేశారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఓబులు సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. దేశానికి సంపద ఆదాయాన్ని పెంచేది కార్మికులే అన్నారు. అలాంటి కార్మికులను ప్రభుత్వాలు అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులు వారి ప్రాణాల సైతం లెక్కచేయకుండా ప్రజలందరి బాగు కోసం సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారన్నారు. కార్మికులందరికీ కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యనూ పెంచాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, మున్సిపల్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, కె.నాగభూషణం, సిఐటియు రెండు పట్టణ కమిటీల కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, అధ్యక్షులు గుర్రాజ, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ట్రెజరర్ బత్తాల ఆదినారాయణ, నగర అధ్యక్ష కార్యదర్శులు బండారి ఎర్రి స్వామి, సాకే తిరుమలేష్, జిల్లా మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఎగురవేస్తున్న నాయకులు

అనంతపురం న్యూ టౌన్ భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతపురం రెండవ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జ్ దగ్గర ఉన్న ఆటో స్టాండ్‌లో ఆటో యూనియన్ కార్యదర్శి ఆదినారాయణ చేతుల మీదుగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అబ్దుల్ గఫూర్, మదర్ వలి, నారాయణస్వామి పాల్గొన్నారు.

గుంతకల్లు : కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేయాలని సిఐటియు నాయకులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవనం వద్ద సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిఐటియు సీనియర్ నాయకులు తిమ్మప్ప, ఎస్ఎం.బాషాలు సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బి.శ్రీనివాసులు మాట్లాడుతూ, సిఐటియు ఆవిర్భావం నుంచి అనేక సమ్మెలు, పోరాటాలు చేసి కార్మికులకు ఎన్నో హక్కులు కల్పించిందన్నారు. కార్మికుల సాధించికున్న ప్రతి హక్కూ పోరాట ఫలితమే అన్నారు. భవిష్యత్తులోనూ సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, జాకీర్, జగదీష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

గుత్తి : కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సిఐటియు జెండాను ఆవిష్కరించి నాయకులు మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు మురళి, కార్యదర్శి రవిశంకర్, నాయకులు నరసింహ, ఆది, నక్కశేఖర్ పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి



గుత్తిలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

ఖరీఫ్ సీజన్లో పంటల సాగు కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్‌లు తెలియజేశారు. గురువారం పట్టణంలోని శ్రీ బాలాజీ ఫర్టిలైజర్స్, చౌడేశ్వరి సీడ్స్, శ్రీ హనుమాన్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని పత్తి, కంది, ఆముదం విత్తనాలను పరిశీలించారు. రికార్డులు, బిల్లు పుస్తకాలు, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. శ్రీ హనుమాన్ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో వివిధ కంపెనీలకు చెందిన విత్తన వివరాలు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో రూ.8,28,312 విలువచేసే 1202 విత్తన పాకెట్లను విక్రయాలు జరగకుండా ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విత్తన కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో పుస్తకాల్లో రైతుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఉరవకొండ : ఫర్టిలైజర్స్ షాప్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర హెచ్చరించారు. గురువారం మండలం కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. భవాని, అభయాంజనేయ ఫర్టిలైజర్ షాపులలో తనిఖీ నిర్వహిస్తూ రికార్డులను పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆధీకత డీలరు ద్వారా తెచ్చుకున్న విత్తనాలు మాత్రమే అమ్మాలని, లేనిపక్షంలో సంబంధిత షాపుల లైసెన్సుల రద్దుకు ప్రతిపాదిస్తామన్నారు. విత్తనాలు, పురుగుమందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు.

అరుదైన వ్యాధికి శస్త్రచికిత్స

ప్రజాశక్తి-పామిడి

పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ కమలాకర్, జనరల్ సర్జన్ డాక్టర్ రాఘవేంద్రరెడ్డి అనస్తియా వైద్యుల పర్యవేక్షణలో వజ్రకరూరు మండలం ఎన్ఎన్‌పి తండాకు చెందిన గోవింద నాయక్‌కు అరుదైన శస్త్రచికిత్సలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గోవిందనాయక్ కొంతకాలంగా ఇన్ఫెక్టెడ్ పేటెంట్ యురాకస్ ఓంపాలిటిస్ అనే జబ్బుతో బాధపడుతున్న చెప్పారు. బొడ్డు దగ్గర ఇన్‌ఫెక్షన్ అయిన ఆయనకు ప్రభుత్వ వైద్యశాలలో విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు చెప్పారు. శరీరంలో ఏర్పడే చిన్నచిన్న కణతులు, లైపోమా, ఆప్సెస్ వంటి కేసులకు పామిడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. అరుదైన శస్త్ర చికిత్స ప్రాణాలు కాపాడిన వైద్యులు, వైద్య సిబ్బందికి గోవిందు నాయక్ కుటుంబ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శస్త్రచికిత్సకు హెడ్‌నర్స్ శివకుమారి, నర్సు కవిత, వైద్య సహకారం అందించారు.




శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని ఎద్దులపల్లి రోడ్డు సర్కిల్ ముత్యాలమ్మ సత్రం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభం ఎప్పుడు కింద పడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రహదారి కావడంతో ఈ స్తంభం విరిగి పడితే ప్రజలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి మధుసూదన్ రావును ఫోన్లో వివరణ అడగగా ఎన్నికల కోడ్ ఉన్నందున మరమ్మతులకు కావాల్సిన వస్తువులు రావడం ఆలస్యం అవుతోందని, త్వరలోనే విద్యుత్ స్తంభాన్ని మరమ్మతు చేస్తామని చెప్పారు.



ఒకపక్కకు ఒరిగి ప్రమాదకరం గా ఉన్న విద్యుత్ స్తంభం

గొడవలకు దూరంగా ఉండండి: సిఐ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని 4వ పట్టణ సిఐ ప్రతాపరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక రుద్రంపేటలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. రుద్రంపేట బైపాస్ నుంచి గవర్నమెంట్ హైస్కూల్, ఆంజనేయస్వామి గుడి మీదుగా ఆలమూరు రోడ్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గొడవలు, అల్లర్లకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐతో పాటు 4వ పట్టణ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

పుట్లూరు : గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని నాయకులపల్లి గ్రామ ప్రజలకు ఎస్ఐ హేమాద్రి సూచించారు. గురువారం సాయంత్రం నాయకునిపల్లి గ్రామంలో పర్యటించి గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని గొడవలు జోలికి వెళ్లకూడదని ఏమన్నా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఘటనలకూ పాల్పడరాదని హెచ్చరించారు.



నాయకులపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న పుట్లూరు ఎస్ఐ హేమాద్రి

టిప్పర్-ద్విచక్ర వాహనం ఢీ

విద్యార్థి మృతి.. ఒకరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి క్రాస్ వద్ద గురువారం నాడు ద్విచక్ర వాహనం, టిప్పర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న విద్యార్థి ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న పుట్లూరు మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన కమ్మర వర్ధనాచారి(19) మరణించాడు. అతని స్నేహితుడు ప్రవీణ్ గాయపడ్డాడు. ఇద్దరూ తాడిపత్రిలో ప్రాక్టికల్ పరీక్షలు ముగించుకుని ద్విచక్రవాహనంలో వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మతుని తండ్రి వెంకటనారాయణ చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరు మృతి

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

గుమ్మగట్ట మండలం పూలకుంట గ్రామం వద్ద గురువారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. రాయదుర్గం నుంచి బీటీ ప్రాజెక్టు గ్రామానికి ట్రాక్టర్లో రెండు విద్యుత్ స్తంభాలను తీసుకుని వెళుతుండగా పూలకుంట గ్రామం వద్ద ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. విద్యుత్ స్తంభాలు ఇంజన్ పై పడి సీట్ల మధ్యలో డ్రైవర్ గొల్ల క్యాతప్ప, వీరేష్(33) ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి వారిని బయటికి తీసి 108కు సమాచారం అందించి ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో హరిజన వీరేష్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో కూలీ...

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మొక్కజొన్న తోటలో పాము కాటు గురైన రైతు కూలీ మరణించిన ఘటన మండల పరిధిలోని కొలగానహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూలీ హరిజన ప్రభాకర్(28) మొక్కజొన్న మేత కోయడానికి కూలి పనికి వెళ్లాడు. పనులు చేస్తుండగా పాముకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బళ్లారి నిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మరణించాడు. ఈ ఘటనపై మృతుని భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బుల్లెట్ వాహన దొంగల గుర్తింపు

ప్రజాశక్తి-నార్పల

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పప్పూరు గ్రామానికి చెందిన జయ అనే వ్యక్తి వారి బంధువులు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరడంతో చూసేందుకు తన బుల్లెట్ వాహనంలో గురువారం వెళ్లాడు. ఈ సమయంలో ఆసుపత్రి బయట పెట్టిన బుల్లెట్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిసి టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూసిన నార్పలకు చెందిన పీరా సప్లయర్స్ షాకీర్ యువకుడు గురువారం ఉదయం నార్పలలో దొంగలను గుర్తించాడు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. పోలీసులకు అక్కడికి చేరుకుని నిందితులను పట్టుకుని, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టించిన షాకీర్‌ను పలువురు అభినందించారు.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

వెంటాడుతున్న సీజనల్ వ్యాధులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఎటువైపు చూసిన కాలువలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఓబులాపురం, వైటి.చెరువు, నరసాపురం, పాత కొత్తచెరువు, ములకలపెంట, నెలగొండ గ్రామాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీటి వల్ల దోమల వ్యాప్తి పెరుగుతోంది. వర్షాలు రావడంతో సీసీ రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతోంది. మంచి నీరు తీసుకెళ్లే ట్యాంకులు వద్ద కూడా మురుగు నీటి నిల్వ పెరిగింది. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. సీజనల్ వ్యాధులు తరుముకొస్తున్న వేళ అధికారులు ఇంత నిర్లక్ష్యం వహించడంపై గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల క్రితం నెలగొండ గ్రామంలో అతిసార వ్యాధితో దాదాపు 40 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటన జరిగిన తర్వాత కూడా అధికారులు అప్రమత్తం కాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు, బ్లీచింగ్ చేయించి, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించే కార్యక్రమాలు చేపట్టాలను గ్రామస్తులు కోరుతున్నారు.



తాగునీటి ట్యాంకు వద్ద ఉన్న మురుగునీరు

ప్రజల జీవితాల్లో పొగాకు చిచ్చు..!

పొగాకు వాడకంతో క్యాన్సర్ ప్రమాదం
నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



డాక్టర్ రంగు సుధీంద్ర


ప్రజాశక్తి అనంతపురం

పొగాకు ప్రజల జీవితాల్లో చిచ్చు రేపుతోందని పొగాకు వాడకం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని అనంతపురంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ ఛాతివైద్యులు డాక్టర్ రంగు సుధీంద్ర అన్నారు. మే 31న నిర్వహించే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు.

పొగాకు వల్ల నష్టాలు : పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు క్యాన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే.

పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది. ప్రపంచ ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటుచేసిన ఎనిమిది అవగాహన కార్యక్రమాల్లో ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం ఒకటి.

ప్రాణాలు పోతున్నా : పొగాకు కారణంగా ప్రాణాలు పోతున్నా పొగరాయుళ్లు పెడచెవిన పెడుతున్నారు. పొగ తాగే వ్యక్తికే కాదు.. పీల్చే వారికి కూడా ప్రమాదకరమే. నిర్లక్ష్యం కారణంగా నిండు జీవితాలు పొగాకు బలి అవుతున్నాయి. పొగాకు ప్రాణాంతకం..! ఇది తెలిసీ చాలామంది ధూమపానానికి బానిసలవుతున్నారు. మానేద్దాం.. మానేద్దాం.. అనుకుంటూనే.. దానిని కొనసాగిస్తున్నవారెందరో వ్యాధుల బారిన పడుతున్నారు. పొగాకు తాగేవారితోపాటు.. వారి కుటుంబసభ్యులు, వారిచుట్టూ ఉన్నవారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. పొగతాగే అలవాటుకు సాధ్యమైనంత తొందరగా పొగబెట్టకపోతే.. అది చివరకు మన ప్రాణాలకే ముప్పుగా మారుతుంది.



ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏనాడో చేసిన హెచ్చరిక. అభిమాన హీరోను చూసో, స్నేహితుల ప్రోద్బలంతోనో, స్టయిల్‌గా ఉంటుందనో.. రెండు వేళ్ల నడుమ సిగరెట్ పెట్టుకొని దమ్ములాగుతున్నారు పొగరాయుళ్లు. మొదట్లో సరదాగానే మొదలుపెట్టి, రోజులు గడుస్తున్నకొద్దీ పొగ దుష్పరిణామాలు ఎదుర్కొంటున్నారు. దగ్గు, దమ్ము, పంటి నొప్పి, గొంతునొప్పి, తలనొప్పి, జలుబు, సైనసైటిస్‌లాంటి చిన్నచిన్న సమస్యలతో మొదలై క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులతో నిండు జీవితాన్ని బలిచేసుకుంటున్నారు.

యువతకు ఫ్యాషన్‌గా మారిన ధూమపానం:

పొగాకు వాడకం వివిధ రూపాల్లో జరుగుతోంది. ప్రధానంగా పొగ రూపంలో పీల్చి, వదలడం నేటి యువతకు ఫ్యాషన్‌గా మారింది. సిగరెట్, బీడీ, చుట్ట, హుక్కా పీల్చడం. ఇలా ఇది ఏ రూపంలో ఉన్నా అంతిమంగా ప్రాణాంతకంగానే మారుతుంది. చాలామంది తమ కాలేజీ రోజుల్లోనే ధూమపానానికి అలవాటు పడుతున్నట్లు పలు నివేదికలు తేల్చాయి. అందులోనూ ఫ్రెండ్స్ ప్రోద్బలంతోనే సిగరెట్ చేతపడుతున్న యువకుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సమాజంలో భవిష్యత్తు తరమైన యువత చెడుమార్గాల వైపు వెళుతున్నా తల్లిదండ్రులు, పోలీసులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పొగతాగడం వల్ల టీబీ, ఊపిరితిత్తుల వ్యాధులు ఎక్కువగా వస్తుండటంతో.. దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని విశ్లేషకులు అంటున్నారు. గతంలో అనంతపురంలో జనవాసాల మధ్య ఇలా దమ్ముకొడితే దుమ్ము దులిపేందుకు పోలీసు ఉన్నతాధికారులు బహిరంగ ధూమపానం నిషేధం అమలు చేశారు. అప్పట్లో ఈ విధానం వల్ల పోలీస్ శాఖ ఔన్నత్యం వల్ల సమాజానికి కొంత మేలు జరిగింది. అయితే పోలీస్ శాఖ రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు కొన్ని రోజులు చర్యలు బాగానే చేపట్టినా మళ్లీ యథాస్థితికి వచ్చింది.